



పలమనేరు మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

ఇప్పటికే ఆరా తీసిన మంత్రి నారాయణ

త్వరలోనే సమగ్ర విచారణకు రంగం సిద్ధం

వైసీపీ హయాంలో

దుకాణాల దందా

వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా పలమనేరు మున్సిపల్ పరిధిలో నిర్మించిన వాణిజ్య దుకాణాల దందా బయటపడింది.

- పలమనేరు, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పరపతి కలిగిన వారికి పలమనేరులో ఖాళీగా ఉన్న లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా అప్పటి మున్సిపల్ అధికారులు కట్టబెట్టారు. ఈ స్థలాలు పొందిన ప్రైవేటు వ్యక్తులు కూడా కేవలం మున్సిపల్ అధికారుల మౌఖిక అనుమతితోనే దుకాణాలను నిర్మించేశారు.

ఇప్పుడేం జరిగిందంటే..

దుకాణాల నిర్మాణాలు పూర్తయిన రెండు నెలలకే ఎన్నికల నోటిఫికేషన్ రావడం అప్పటి మున్సిపల్ అధికారులు బదిలీపై వెళ్లిపోవడం జరిగింది. ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో దుకాణాలు నిర్మించుకున్నవారు వీటిని క్రమబద్ధీకరించుకోవడానికి ప్రస్తుత మున్సిపల్ అధికారులను సంప్రదించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దుకాణాలను క్రమబద్ధీకరించడానికి అధికారులు ససేమిరా అన్నారు. మరోవైపు ఈ విషయమై మున్సిపల్ ఉన్నతాధికారులకు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు ఫిర్యాదులు అందాయి. దుకాణాల దందాపై మంత్రి కూడా ఆరా తీసినట్లు సమాచారం. ఈ అక్రమ నిర్మాణాలపై త్వరలోనే సమగ్ర విచారణకు చేపట్టడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. విచారణ పూర్తయ్యాక పలువురు అధికారులు సస్పెండ్ అయ్యే అవకాశం కూడా ఉందని మున్సిపల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.





మరుగుదొడ్ల స్థలంలో దుకాణాలు

23 దుకాణాలు ఇలాంటివే..!

- ఆర్టీసీ బస్టాండు వద్ద రాజకాలువను కుదించి మరీ దుకాణాలను నిర్మించేశారు. ఈ కాలువ గుండానే పలమనేరులోని కొత్తపేటలోని 50 శాతంపైగా వర్షపునీరు పట్టణానికి ఆనుకుని ఉన్న పెద్దచెరువుకు వెళ్తుంది. ఇంతటి ప్రధాన కాలువను కుదించడంతోపాటు దారికోసం దానిపై స్లాబ్ వేసేశారు. నిర్మాణ సమయంలో ఆర్టీసీ అధికారులు అభ్యంతరం తెలిపినా అప్పటి మున్సిపల్ అధికారులే మద్దతివ్వడంతో మిన్నకుండిపోయారు.
- పలమనేరు శాఖా గ్రంథాలయ సమీపంలో జాతీయ రహదారికి దగ్గర మురుగు కాలువ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలోనూ దుకాణాలను నిర్మించేశారు.
- జాతీయ రహదారిలో గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను సైతం కూల్చివేసి దుకాణాలను నిర్మించారు. ఇలా పలు చోట్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో 23 దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా వెలిశాయి.



రాజుపేట వద్ద..

■ మంచు దుప్పట్లో రామకుప్పం

నాలుగైదు రోజులుగా రామకుప్పం ప్రాంతంలో చలి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. తెల్లవారుజాము నుంచి దట్టంగా మంచు కురుస్తూ మన్యం వాతావరణాన్ని తలపిస్తోంది. దీంతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంటోంది. ఉదయం 8.30 గంటల వరకు కూడా మంచు వీడటం లేదు. మధ్యాహ్నం మూడు గంటలకే ఎండ తగ్గిపోతోంది. నెమ్మదిగా మంచు వాతావరణం కమ్ముకుని, చలి తీవ్రత పెరుగుతోంది. ఇబ్బందులున్నా ఆహ్లాదకర మంచు వాతావరణాన్ని జనం ఆస్వాదిస్తున్నారు.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి



బజారువీధిలో..

19 నుంచి కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఈనెల 19నుంచి 22వ తేదీదాకా నాలుగు రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మారుమూల పల్లెల్లో సైతం మహిళలతో ముఖాముఖి సమావేశమై వారి కష్టాలు తెలుసుకుని, ఎన్టీఆర్ ట్రస్టు కార్యక్రమాలు పర్యవేక్షించనున్నారు. టీడీపీ వర్గాల సమాచారం మేరకు 18వ తేదీ రాత్రికి కుప్పంలోనీ పీఈఎస్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అక్కడినుంచి శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటిని పరిశీలిస్తారు. ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేరుకుని విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటలదాకా శాంతిపురం మండలం నలగాంపల్లెలో గ్రామీణులతో మమేకమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం చేరుకుని స్కిల్ డెలప్‌మెంట్ సెంటర్ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 3.45 గంటలకు ఎన్టీఆర్ ట్రస్టు తరఫున చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేస్తారు. సాయంత్రం 4.45 గంటలకు డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 6 నుంచి 7 గంటలదాకా టీడీపీ ముఖ్య నేతలతో సమావేశమై పార్టీ స్థితిగతుల గురించి ఆరా తీస్తారు. ఈనెల 20వ తేదీ ఉదయం ప్రజలనుంచి వినతులు స్వీకరించాక 10 గంటలకు కుప్పం మండలం వెండుగంపల్లె గ్రామానికి వెళ్లి మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు అడవిబూదుగూరులో మహిళలతో సమావేవమవుతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కొట్టాలూరు పంచాయతీ గుండ్లమడుగులో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యంగ ఆలయం చేరుకుని స్వామివారికి వెండి కిరీటం సమర్పిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు కుప్పం పురపాలక సంఘం డీకే.పల్లె చేరుకుని మహిళలతో సమావేశమవుతారు. 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు రామకుప్పం మండలం మొద్దులవంక చేరుకుని మహిళలతో మమేకమవుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గాంధీనగరం చేరుకుని మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు శాంతిపురంలోని నందిగం కళ్యాణ మండపంలో మండల డ్వాక్రా మహిళలతో సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు మొరసనపల్లె చేరుకుని మహిళలతో సమావేశమవుతారు. 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె చేరుకుని మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం పలమనేరు నియోజకవర్గం వి.కోటకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుని అక్కడ సుజల వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు వి.కోటనుంచి బయల్దేరి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాదుకు వెళ్తారు.





■ 'తల్లి'డిల్లుతున్న వానరం

బిడ్డ మృత్యువాత పడిందని తల్లి వానరం మనసు తల్లడిల్లిపోతోంది. సదుం కాలేజీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిత్యం తిరుగాడే ఓ వానరం ఇటీవల బిడ్డను ప్రసవించింది. తన చిన్నారిని ప్రేమగా సాకేది. దురదృష్టవశాత్తూ బలమైన గాయం తగిలి ఆ బుల్లివానరం రెండ్రోజుల కిందట చనిపోయింది. దీంతో తనలోని అమ్మ మనసును చాటుకుంటూ చనిపోయిన బిడ్డను చంకన పెట్టుకుని తిరుగుతోంది. అచేతనంగా ఉన్నా, దుర్గంధం వస్తున్నా బిడ్డను వీడలేదు. కొమ్మ, గోడ, మిద్దెలపై దానిని ఎత్తుకు తిరుగుతోంది. పదేపదే బిడ్డ గాయాన్ని చూస్తోంది. తల్లి వానరానికి తోడుగా మరో సహచరి తిరుగుతోంది. దీన్నిచూసి స్థానికులు చలించిపోతున్నారు.

- సదుం, ఆంధ్రజ్యోతి

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆలయంలో రూ.150, రూ.100 క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఇబ్బందులు తలెత్తకుండా ఏఈవో రవీంద్రబాబు పర్యవేక్షించారు. ఉచితం ద్వారం ద్వారా విచ్చేసిన భక్తులకు స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది.





కొట్టుకుపోయిన వంతెన (ఫైల్ ఫొటో)

'వంతెన' సమస్యకు పరిష్కారమేదీ?

కుశస్థలీ నదిపై ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతున్న జనం

నగరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి నుంచి కీళపట్టుకు వెళ్లే మార్గంలో కుశస్థలీ నదిపై ఉన్న వంతెన సమస్య ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. దీనివల్ల వానొచ్చిందంటే ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 70 ఏళ్ల క్రితం నాటి వరదలకు సరిపోయేలా ఈ వంతెనను నిర్మించారు. కృష్ణాపురం, అమ్మపల్లె రిజర్వాయర్‌ను తెరిచినట్లయితే వరద ఉధ్రుతి పెరిగి వంతెనపై ఉండే రోడ్డుపై నీటి ప్రవాహం ఉంటుంది. ఇక వానాకాలంలో వరద పోటెత్తితే తిరుత్తణి వైపు వెళ్లేవారు, నగరివాసులు, నగరి మండలంలోని పది గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పవు. నగరి చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు, మూడు సార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినా పనులు చేపట్టలేదు. తాజాగా నాలుగు రోజుల కిందట కురిసిన వర్షాలకు వచ్చిన వరద ఉధ్రుతికి ఈ వంతెన కొట్టుకుపోయింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని జనం కోరుతున్నారు.

బిక్కు బిక్కుమంటూ..



వంతెన చిన్నది కావడంతో వర్షాకాలంలో సమస్యలు తప్పడం లేదు. ఏ సమయంలో వరదలొస్తాయో తెలియని పరిస్థితి. వానాకాలంలో బిక్కు, బిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది

- సెల్వమణి, నాగరాజుకుప్పం

నగరి చుట్టూ తిరిగి వెళ్లాలి



వరదలొచ్చే నీటి ప్రవాహం పెరిగి వంతెనపై వెళ్లడానికి వీలుకాదు. అటువంటప్పుడు కంచి, అరక్కోణం, చెన్నైకి వెళ్లే బస్సులు నగరి చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే.

- పురుషోత్తంనాయుడు, తడుకుపేట

తాత్కాలిక మరమ్మతులు

కుశస్థలీ నదిపై కొట్టుకుపోయిన వంతెనకు తాత్కాలిక మరమ్మతులను సంబంధిత అధికారులు ఆదివారం పూర్తి చేశారు. ఈ పనులను నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పరిశీలించారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ఒంటరి ఏనుగు సంచారం

- ఆవులపల్లె పంచాయతీ రైతుల్లో ఆందోళన



సోమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఆవులపల్లె పంచాయతీలో ఒంటరి ఏనుగు సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి కొత్తూరు సమీపంలోని శ్రీరామరాజు వరి పొలంలో పైర్లను తొక్కేసి, తీవ్రంగా నష్ట పరిచింది. సమీప పొలంలోని అడవి పందుల కోసం కాపుగాస్తున్న రైతులు ఈ ఒంటరి ఏనుగును గమనించి.. డప్పులు వాయించి అడవి వైపు మళ్లించారు. మూడ్రోజులుగా నగిరాల కొండ సమీపంలో ఈ ఏనుగు మకాం వేసింది. చీకటిపడగానే టమోటా, వంగ, మామిడి తోటలపై పడుతోంది. పంట కోత దశలో ఏనుగు దాడులతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం.. చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పించిన ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. అమరజీవి వర్థంతి సందర్భంగా ప్రభుత్వం డిసెంబరు 15వ తేదీని ఆత్మార్పణ దినంగా ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. డీఆర్వో మోహన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ బాషా, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కషాయంతో పురుగు మందులకు విరుగుడు

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి - సాగును లాభాలబాట పట్టించిన వెంకటరెడ్డి


సిద్ధమైన కషాయం

పుంగనూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురుగుమందుల నివారణకు పిచికారీ చేయకుండానే అధిక దిగుబడులను సాధించవచ్చునని పుంగనూరు మండలం బండ్లపల్లెకు చెందిన వెంకటరెడ్డి నిరూపిస్తున్నారు. ఈ రైతు గతేడాది నుంచి ఆర్గానిక్ కషాయం తయారీ చేస్తున్నారు. టమోటా, కాకర పంటల సాగులో వినియోగిస్తున్నారు. గత ఏడాది టమోటాలో మంచి ఆదాయం లభించినట్లు రైతు చెప్పారు. ప్రస్తుతం కాకర సాగు చేస్తున్నారీయన. ఇది కూడా లాభాల బాటలో ఉందంటున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడితే భూములు దెబ్బతింటాయని, భవిష్యత్‌లో సాగు అవకాశాలు సన్నగిల్లుతాయని తాను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానంటున్నారు. పైగా ఆర్గానిక్ కషాయంతో పురుగు, తెగుళ్ల దరిచేరవంటున్నారు.

ఎకరానికి ఆర్గానిక్ కషాయం తయారీ ఇలా..

200 లీటర్ల నీటిలో ఆవు పెరుగు 10లీటర్లు, కానుగ పిండి 20 కిలోలు, వేప పిండి 20 కిలోలు, బెల్లం ఊట 10 లీటర్లు, బెల్లం 20 కిలోలు, గోమూత్రం 10 లీటర్లు, వేరుశనగ పిండి 20 కిలోలు కలిపి రెండు నెలలు నిల్వ చేశాక పంటలపై పిచికారీ చేయాలి.


కాకరకాయ పంట సాగులో రైతు వెంకటరెడ్డి

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ


గంగమ్మ ఆలయంలో చండీహోమం

చౌడేపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల నామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఉదయం అర్చకులు వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. పంచామృతాభిషేకాలు చేశారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిచారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు వచ్చారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. పౌర్ణమి సందర్భంగా ఆశీర్వాద మండపం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు.

రేపు కాణిపాకంలో భజన కార్యక్రమం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం భక్తి భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తి భజన గీతాలాపన, జానపద గీతాలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈనెల 25న హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు, ఉభయదారులు పాల్గొనాలని కోరారు.

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు


జస్టిస్ చక్రధరి శరణ్‌సింగ్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆర్వీ రవీంద్రన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధరి శరణ్‌సింగ్, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆర్వీ రవీంద్రన్ ఆదివారం వరసిద్ధుడిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు, కాణిపాకం ఎస్‌ఐ ధరణిధర పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్కంటి దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెల్లవారుజామున 3గంటలకు పురవీధుల్లో జేగంట, 4గంటలకు మంగళ వాయిద్యాలు, 4.15గంటలకు గోపూజ, తిరుమంజనం, 4.30గంటలకు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారం, ఉదయం 5గంటలకు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం (సేవలు లేవు), 6గంటలకు రెండవ కాల అభిషేకం, 7గంటలకు పరివార దేవతా నైవేద్యం, 7.30గంటలకు గొబ్బెమ్మ ఉత్సవం, 10.30 గంటలకు మూడవ కాలాభిషేకం(ఉచ్చికాలం), సాయంత్రం 5గంటలకు ప్రదోషకాలాభిషేకం ఉంటుందని తెలియజేశారు. శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం రోజుల్లో రాత్రి 9గంటలకు పల్లియ పూజ, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. మూడవ కాలాభిషేకం, సాయంత్రం 4గంటలకు జరిగే మహన్యాస పూర్వక రుద్రాభిషేకానికి మాత్రం భక్తులకు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. ఇక 13వ తేదీ ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం నటరాజస్వామికి అభిషేకం, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి వేడినీళ్లతో అభిషేకం, సాయంత్రం అరికట్ల ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని సేవలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరుకువారిపల్లె ఎన్నికపై కలెక్టర్‌కు టీడీపీ నాయకుడి ఫిర్యాదు

పుంగనూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెరుకువారిపల్లెలో శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని కలెక్టర్‌కు టీడీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ. తాము అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఎన్నిక నిలిపివేయాలని ఫిర్యాదు చేసినా ఎన్నికల అధికారి పట్టించుకోలేదన్నారు. భూమి లేకపోయినా, చనిపోయినా ఓట్లు తొలగించకుండా జాబితా రూపొందించారన్నారు. ఓటర్ల జాబితా తప్పులు తడకగా ఉందన్నారు. అర్హులనే ఓటర్లుగా చేర్చాలని, ఎన్నిక వాయిదా వేయాలని కోరామన్నారు. వాయిదా వేస్తామని ఎన్నికల అధికారి పేర్కొని తర్వాత అప్రజాస్వామికంగా వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారన్నారు. ఉన్నతాధికారులు విచారించి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

తమిళనాడు బియ్యం స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్టు


పట్టుబడ్డ బియ్యం

కుప్పం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న 5,200 కిలోల బియ్యాన్ని కుప్పం పోలీసులు సీజ్ చేశారు. ఇన్‌చార్జి అర్బన్ సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం డీకే పల్లె కూడలి వద్ద తమిళనాడు నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న మినీ లారీని పోలీసులు ఆపారు. తనిఖీ చేయగా 109 మూటల బియ్యం కనిపించాయి. ఆరా తీస్తే తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యంగా నిర్ధారణ అయింది. బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న కోలారు తాలూకా బంగారుపేటకు చెందిన వెంకటేశ్, హమీద్, శివాజీలను రిమాండ్‌కు తరలించారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేశారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. పూతలపట్టు మండలం వావిల్‌తోటకు చెందిన బుజ్జి, నెల్లూరు జిల్లా నాగోలు గ్రామానికి చెందిన శారద, బాలాయపల్లికి చెందిన పి.సుబ్రమణ్యంతో కలసి కొన్ని రోజులు భవానీనగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. కోస్తా ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిపిస్తున్నారు. ఈస్ట్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణకు సమాచారం రావడంతో ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సుబ్రహ్మణ్యం, బుజ్జి, శారదను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వెలసి ఉన్న వరదరాజస్వామి ఆలయంలో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఏఈవో రవీంద్రబాబు, ఆలయ సూపరింటెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


వరదరాజస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

హైరోడ్డులో స్వల్ప ఉద్రిక్తత

పరిహారమిచ్చాకే ఆక్రమణలు తొలగించండి - అధికారులతో బాధితుల వాగ్వాదం


మసీదు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు - రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధితులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని హైరోడ్డు ఆక్రమణల తొలగింపులో భాగంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పది రోజులుగా హైరోడ్డుతోపాటు పలమనేరు రోడ్డు, పుత్తూరు రోడ్డు, వేలూరు రోడ్డులోని ఆక్రమణలకు మార్కింగ్ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదివారం శేషాపిరాన్ మసీదు వద్ద ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లతో మసీదు వద్ద ఉన్న ఓ టీ దుకాణం, ఏటీఎంను తొలగించే పనులు చేపట్టారు. దాంతో తన పేరుతో ఉన్న షాపును ఎలా తొలగిస్తారని అక్మల్‌ఖాన్ అనే వ్యక్తి టౌన్‌ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. రైల్వేస్టేషన్ నుంచి పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల వరకు వక్ఫ్‌బోర్డుపై రికార్డుల్లో ఉందని, దాంతో వక్ఫ్‌బోర్డు కమిటీకి నోటీసులు ఇచ్చామని టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పారు. ఆ తర్వాత కమిటీ సభ్యులు ఆమోదం తెలపడంతోనే పనులు చేపట్టామని వివరించారు. అయితే ఈ దుకాణంపై కోర్టులో స్టే ఉందని, అలాంటప్పుడు ఎలా తొలగిస్తారని అక్మల్‌ఖాన్ ప్రశ్నిస్తుండగా హైరోడ్డు బాధితులంతా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. నగరాభివృద్ధికి తాము అడ్డుకాదని, నష్టపరిహారాన్ని నగదు రూపంలో ఇచ్చాకే తొలగించాలని హైరోడ్డు బాధితుల సంఘం అధ్యక్షుడు మనోహర్, సెక్రటరీ వెంకటేశులు నాయుడు, నేతలు హరి, శ్రీనివాసులు, వెంకటేశులు నాయుడు, అబ్దుల్, నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో మసీదు వద్దకు చేరుకోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులొచ్చి ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. బాధితులంతా రోడ్డుపై నినాదాలు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడ నుంచి ఎక్స్‌కవేటర్లను తీసుకుని వెళ్లిపోయారు. కాగా, అంతకుముందు హైరోడ్డు బాధితుల సంఘం ఆధ్వర్యంలో సింధు హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. 2015 నుంచి బాధితులకు నగదు రూపంలో నష్టపరిహారాన్ని ఇచ్చిన తర్వాతే తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సమావేశంలో తీర్మానించారు.

'మ్యాపింగ్'కు దూరంగా 1,52,457 మంది

కొత్తగా నమోదుకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరానికి చెందిన ఓ కుటుంబం ఇప్పటివరకు కుటుంబ మ్యాపింగ్ (హౌస్‌హోల్డ్ మ్యాపింగ్) కాలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది పలుసార్లు ప్రయత్నించినా వారు మ్యాపింగ్ చేసుకోలేదు. దాంతో ఆ కుటుంబం పలు ప్రభుత్వ పథకాలకు దూరమైంది. ఇలాంటి వారిని కొత్త కుటుంబాలుగా మ్యాపింగ్ చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఇప్పటివరకు గుర్తించింది

ఇప్పటివరకు కుటుంబ మ్యాపింగ్‌లో నమోదు కాని వారి వివరాలను ప్రభుత్వం గుర్తించింది. వివిధ శాఖల ద్వారా పొందుతున్న సేవల ఆధారంగా ఈ జాబితాను తయారు చేసినట్లు సమాచారం. ఈ లెక్కన జిల్లాలో 1,52,457 మంది మ్యాపింగ్‌కి దూరంగా ఉన్నారు. వీరిలో.. అత్యధికంగా చిత్తూరులో 17,190 మంది ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో కుప్పంలో 2,632, గంగాధరనెల్లూరులో 5,365, బంగారుపాళ్యంలో 5,791, పుంగనూరులో 5,160, నగరిలో 5,377, వి.కోటలో 5,718 మంది మ్యాపింగ్ కాలేదు. వీరికోసం పది రోజులుగా చేపట్టిన సర్వేలో పుంగనూరులో 46.52 శాతం, శాంతిపురంలో 40.48 శాతం, కార్వేటినగరంలో 37.50 శాతం, రొంపిచెర్లలో 10.78 శాతం, విజయపురంలో 11.40శాతం, అతి తక్కువగా పూతలపట్టులో 8.77 శాతం పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 23.03 శాతం మ్యాపింగ్ నమోదైంది.


తవణంపల్లె మండలం దిగువమాఘం సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వే

తప్పనిసరిగా మ్యాపింగ్ చేయించుకోవాలి

గతంలో కుటుంబ మ్యాపింగ్‌లో నమోదు కానివారిని ప్రస్తుతం సచివాలయ సిబ్బంది ద్వారా చేయిస్తున్నాం. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ సేవలు, పథకాలకు ఇది కీలకం కానుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మ్యాపింగ్ చేయించుకోవాలి.

- విద్యాధరి, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

కనులపండువగా కార్తీక దీపోత్సవం


ఆలయంలో నుంచి మూకుళ్లలో దీపాలను తీసుకొస్తున్న జీయర్‌స్వామి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, అధికారులు, అర్చకులు - శ్రీవారి ఆలయంలో వెలుగుతున్న దీపాలు - పుష్కరిణి వద్ద..

శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్తీక పౌర్ణమి దీపోత్సవం కనులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనున్న పరిమళం అర వద్ద 80 కొత్త మూకుళ్లలో దీపాలను వెలిగించారు. వీటిని ఛత్రఛామర, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. తర్వాత గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనుడు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద వెయ్యి నేతి జ్యోతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పౌర్ణమిగరుడసేవను రద్దు చేశారు. ఈ దీపోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. **- తిరుమల, ఆంధ్రజ్యోతి**



అమ్మవారి ఆలయంలో..

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి అర్చకులు, అధికారులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం, ఇతర ఆలయాలు, గర్భాలయం, పుష్కరిణి, ఆస్థాన మండపంతోపాటు పలు ప్రాంతాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, చలపతి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

స్కూటర్‌ను ఢీకొన్న కారు

టీడీపీ కార్యకర్త దుర్మరణం


గోవిందమ్మ (ఫైల్ ఫొటో)

నగరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో టీడీపీ కార్యకర్త, నగరి మండల పరిధిలోని మాంగాడు దళితవాడకు చెందిన గోవిందమ్మ దుర్మరణం చెందారు. తిరుపతిలో మరిది మనవడి నామకరణం కార్యక్రమంలో పాల్గొనడానికి మరో మహిళతో కలిసి స్కూటీపై గోవిందమ్మ ఆదివారం బయల్దేరారు. మార్గమధ్యంలో చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వకుళమాత ఆలయం వద్దకొచ్చేసరికి స్కూటీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోవిందమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ మరో మహిళను రుయాస్పత్రికి తరలించారు. ఈమె మృతి పట్ల నగరి టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా సంతాపం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50 ఎరవేసి.. సెల్‌ఫోన్ చోరీ

గంగాధరనెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మీ డబ్బులు కింద పడిపోయాయని చెప్పి.. ఓ రిటైర్డ్ హెచ్ఎం వద్ద సెల్‌ఫోన్ చోరీచేశారు. గంగాధర నెల్లూరు(ఎగవూరు)లో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెచ్ఎం రాజేంద్రపిళ్లై ఆదివారం ఉదయం 10గంటల ప్రాంతంలో బస్టాప్ కూడలిలోని ప్రొవిజన్ స్టోర్ వద్దకెళ్లారు. అక్కడికి ముగ్గురు యువకులు వచ్చారు. ఒకరు బైక్‌పై ఉండగా, ఇద్దరు యువకులు రిటైర్డ్ హెచ్ఎం వద్దకు వచ్చారు. ఆయన కాలు వెనుకభాగంలో రూ.50 నోటు పడేశారు. 'సార్.. డబ్బులు కింద పడి ఉన్నాయి.. మీవేనా చూడండి' అని చెప్పారు. ఆయన వంగి చూడగా, చొక్కా జేబులోని సెల్‌ఫోన్‌ను లాక్కొని.. బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో యువకుడితో కలిసి పరారయ్యారు. ఈ చోరీపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లోకేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మణికంఠ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల స్టేషన్‌కు వచ్చిన లోకేష్ అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సీఐ జయరామయ్య.. ఎస్పీకి నివేదిక అందజేశారు. దీనిపై విచారణ జరిపించిన ఎస్పీ.. కానిస్టేబుల్ తప్పిదం చేసినట్లు గుర్తించారు. దీంతో ఇతడిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ కళాశాలల బోధనేతర సిబ్బంది జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా డిగ్రీ కళాశాలల బోధనేతర సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.హరిప్రసాద్(సీనియర్ అసిస్టెంట్, పీవీకేఎన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్, కోశాధికారిగా కమల్ బాబు, గౌరవ అధ్యక్షుడిగా దొరైకన్నన్, సహాయ కార్యదర్శులుగా రసూల్ బాషా, వాయల్పాడు డిగ్రీ కళాశాలల అసోసియేట్ అధ్యక్షుడిగా రియాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివ, మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

తుడా ఉత్కంఠకు తెర పడేనా..!

● చైర్మన్ రేసులో శంకర్ రెడ్డి?

తిరుపతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్ పదవిపై ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. టీడీపీ, జనసేన కూటమి పార్టీల నుంచి పలువురు పోటీపడుతున్న నేపథ్యంలో ఈ పదవికి కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్రంలో దాదాపు అన్ని పట్టణాభివృద్ధి సంస్థలకు చైర్మన్లను నియమించినప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు తుడాను మాత్రం భర్తీ చేయకుండా వాయిదావేస్తూ వచ్చారు. తొలినుంచీ తుడా రేసులో ముందున్న ప్రముఖ కాంట్రాక్టర్ కె.శంకర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. తొలినుంచి టీడీపీకి విధేయుడిగా ఉన్న ఆయన ఎన్నికల ముందు శ్రీకాళహస్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన జాబితాలో ఉన్నారు. టీడీపీ యువనేతతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో తుడా పదవి ఆయన్నే వరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈవారంలో అధినేత నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ ఆశావహుల్లో నిరాశ: పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తుడాపై ఆశలు పెట్టుకున్నారు. అదేవిధంగా పార్లమెంటు అధ్యక్షుడు, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్‌కూడా మరోసారి తుడా కుర్చీని ఆశిస్తున్నారు. అందుకే నెలరోజుల క్రితం రాష్ట్ర యాదవ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌ను నియమించినప్పటికీ ఆయన ఇప్పటివరకు ప్రమాణస్వీకారం చేయలేదు. వీరు నిరాశపడే పరిస్థితి కనిపిస్తోంది.

సభ్యత్వ నమోదులో వెనుకంజ అందుకేనా? : టీడీపీ నేతలు ఆశించిన పదవులు రాకపోవడం, వచ్చిన పదవుల్లోనూ కొందరు అసంతృప్తిగా ఉండడం, భవిష్యత్తులో పదవులు వస్తాయో? రావో అన్న గ్యారెంటీ లేకపోవడం వంటి కారణాలవల్లే టీడీపీ సభ్యత్వ నమోదులో తిరుపతి వెనుకబడి వుందని అంటున్నారు. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 50వేల సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ సూచించింది. ఇప్పటివరకు 20వేలు కూడా దాటని పరిస్థితి నెలకొంది. 175 నియోజకవర్గాల్లో చివరి పాతిక నియోజకవర్గాల్లో తిరుపతి ఉండడంపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది.

పాఠశాల ఎదురుగా దుర్గంధంతో ఇబ్బందులు



కల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారి పల్లి పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా చెత్తా చెదారంతో దుర్గంధభరితంగా తయారైంది. ఈ పాఠశాలలో కావేటిగారిపల్లి, చెరువుముందురపల్లి, గొల్లపల్లికి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. కావేటిగారి పల్లి, గొల్లపల్లి నుంచి విద్యార్థులు రోజూ ఇదేమార్గంలో పాఠశాలకు వస్తుంటారు. చెత్తకుప్పల నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడిన సమయంలో పశువుల ఆసుపత్రి నుంచి పాఠశాల వరకు మురికినీరు ప్రవహిస్తుంది. విద్యార్థులు అంటువ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. గ్రామ పంచాయతీ స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి


ఛలో విజయవాడ కరపత్రాలతో వీహెచ్‌పీ నాయకులు

సోమల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు కోరారు. ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మండల స్థాయి వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, వాసు, శివశంకర్, లక్ష్మయ్య, హరినాథ్, రెడ్డిశేఖర్, జనార్థన్, గోపీ, అభిషేక్, మునివెంకటప్ప, జగన్, హేమగిరి, శ్రీకాంత్, నవీన్ రాయల్, సునీల్, రామచంద్రయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల కలయిక



సోమల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కందూరు హైస్కూల్‌లో 1985- 86 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి తమ గురువులను సన్మానించారు. జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. గురువులు రాయప్పరెడ్డి, పాపిరెడ్డి, విజయకుమారి, వెంకటమునిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. దివంగతులైన ఉపాధ్యాయులకు వారు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

50మందికి ఉచితంగా కంటి పరీక్షలు



రామకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. 50రోగులకు కంటి పరీక్షలు చేశారు. 10 మంది రోగులను శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యులు సంజనారెడ్డి, అనుపమ, శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రివారు కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. సుమారు 120 మంది కంటి వ్యాధిగ్రస్తులు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. 42 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు.

నాడు-నేడు పనుల అక్రమాల నిగ్గు తేలుతుంది


నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనుల్లో జరిగిన అక్రమాల నిగ్గు త్వరలోనే తేలుతాయని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. ఆదివారం ముద్దనపల్లె ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. నాడు-నేడు కింద పాఠశాలలో పనుల కోసం రూ.47లక్షలు మంజూరుకాగా ఇప్పటికే రూ.42లక్షల మేర బిల్లులు డ్రా చేసుకున్నారని ఎస్ఎంసీ ఛైర్మెన్ నందకుమార్, నేతలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పనులు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఆనందరెడ్డి మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. విచారణానంతరం అక్రమార్కులపై చర్యలుంటాయాన్నారు. టీడీపీ నేతలు రఘు, మురళీ, నవీన్, సుబ్రీ, మునిరెడ్డి, పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ



పెద్దపంజాణి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే కాసులవాడ శంకర్ ఇటీవల తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వెలమ కులస్థులు మండిపడ్డారు. ఆదివారం వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌరవమైన పదవిలో ఉంటూ ఒక సామాజిక వర్గాన్ని కించపరచడం సరికాదన్నారు. కార్యక్రమంలో వెలమ సంఘ నాయకులు నాగరాజ, శ్రీనివాసులు, రామక్రిష్ణ, సురేష్, నందగోపాల్, ధనుంజయ, బుజ్జిబాబు, రామమూర్తి, సుబ్రమణ్యం, గోపాల్‌లు పాల్గొన్నారు.

జానపద నృత్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



పుంగనూరు రూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): జానపద నృత్యాల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆదివారం స్థానిక తూర్పుమొగసాల మున్సిపల్ పాఠశాలలో జానపద నృత్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సారా స్థావరంపై దాడి: 1200 లీటర్ల ఊట ధ్వంసం



వెదురుకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంటు పోలీసులు దాడులు జరిపి సారా ఊటను ధ్వంసం చేశారు. కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌పురం మండలం చిన్నతయ్యూరు కాలనీ శివార్లల్లో దాడులు నిర్వహించి 1200లీటర్ల ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఎస్ఐ సుబ్రహ్మణ్య, హెడ్ కానిస్టేబుళ్లు సుందరం, దేవప్రసాద్, కానిస్టేబుళ్లు తంబేష్, డిల్లీబాబు, రాజేష్ పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి


సుబ్రమణ్యం (ఫైల్‌ఫొటో)

తవణంపల్లె, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. తవణంపల్లె పోలీసుల కథనం మేరకు వివరాలు. మండలంలోని కాణిపాక పట్నం గ్రామానికి చెందిన మాణిక్యం కుమారుడు సుబ్రమణ్యం(74) కనబడటంలేదు. దీనిపై సుబ్రమణ్యం కుమారుడు నందకుమార్ ఈ నెల 6వ తేదీన తవణంపల్లె పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం పట్నం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో మృత దేహం ఉందని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, సుబ్రమణ్యంగా గుర్తించారు. మృతుడి కుమారుడు నందకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

పుంగనూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): అఖిలభారత విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 17న సమావేశం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శ్రీరాములు(ఫైల్)

పుంగనూరు రూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమగానిపల్లె పంచాయతీ వెంకటాద్రికాలనీకి చెందిన శ్రీరాములు(60) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. శనివారం రాత్రి రోడ్డు పక్కన నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీరాముల్ని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆలయ భూముల్లో చెట్ల నరికివేతపై ఫిర్యాదు


పెద్దఉప్పరపల్లె సమీపంలో నరికేసిన చెట్లు

సోమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దఉప్పరపల్లె సమీపంలోని ఆలయ భూముల్లో విలువైన వృక్షాలను కొందరు నరికివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సీతమ్మ చెరువు కట్ట వద్ద పురాతన సోమేశ్వరాలయానికి ఐదెకరాల మాన్యం భూమి ఉంది. ఇందులో విలువైన తైలం వృక్షాలున్నాయి. ఆలయ భూములను కౌలుకు తీసుకున్న వ్యక్తులే ఆ వృక్షాలను నరికివేస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించి అడ్డుకున్నారు. దేవదాయశాఖ అధికారులకు వారు ఫిర్యాదు చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో తహసీల్దారుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆదివారం కొందరు చొరబడి నరికిన వృక్షాలను తరలించినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

రామకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకాంత్ తెలిపారు. కెంచనబల్ల, చెల్దిగానిపల్లె, పంద్యాలమడుగు, వీర్నమల, 89పెద్దూరు, బల్ల గ్రామసచివాలయాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు క్యాంపులకు వెళ్లి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మ గుడిలో చోరీ

సోమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పుంగనూరు-తిరుపతి రోడ్డు సమీపంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. వివరాలిలా..పూజారి మల్లికార్జున ఉదయం 9గంటలకు ఆలయ ప్రధాన గేటుకు తాళాలు తీసి వచ్చేశారు. ప్రధాన ఆలయ తాళం తీయలేదు. పూజారి సాయంత్రం 5గంటలకు లైట్లు వేయడానికి ఆలయానికి వెళ్లారు. లోపలి హుండీ పగులు కొట్టి కనిపించింది. అందులో కానుకలను దుండగులు చోరీచేసినట్లు గుర్తించారు. అమ్మవారి గర్భగుడి తాళాలు పగలగొట్టి నాలుగు తాళిబొట్లు తీసుకుపోయారని గమనించారు. ఆయన సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తే వివరాలు తెలుస్తాయని భావిస్తున్నారు.

క్రిస్మస్ ప్రార్థనల ర్యాలీ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర క్రిస్టియన్లు అత్యంత పవిత్రంగా నిర్వహించుకోనున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం పలమనేరు గోస్పెల్ చర్చి నిర్వాహకులు బైబిల్ ప్రార్థనల ర్యాలీ నిర్వహించారు.

అద్దె భవనంలో సబ్ ట్రెజరీ కార్యాలయం

ఇరుకు గదిలో ఉద్యోగుల ఇబ్బందులు - మెట్లెక్కలేక పెన్షనర్ల అవస్థలు


2019లో వేసిన భవన నిర్మాణ శిలాఫలకం

పలమనేరు, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : నియజకవర్గ కేంద్రంలో సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటీష హయాంలో పోలీసుస్టేషన్, తహసీల్దార్, సబ్‌ట్రెజరీ కార్యాలయాలు ఒకే భవనంలో ఏర్పాటయ్యాయి. తర్వాత పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించారు. సబ్ ట్రెజరీ మాత్రం నాలుగేళ్లక్రితం వరకు కూడా పాత భవనంలోనే కొనసాగింది. వర్షాలకు పైకప్పునుంచి లోపలికి నీరు ఉరుస్తుండటంతో రికార్డులు తడిసి ముద్దయి పోయాయి. ఈ నేపథ్యంలో రెండేళ్లక్రితం అద్దె భవనంలోకి సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని మార్చారు. అయితే ఈభవనం మిద్దెపై కార్యాలయం ఉన్నందున విశ్రాంత ఉద్యోగులు మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో సిబ్బందికి అసౌకర్యంగా ఉంది. కొత్త భవన నిర్మాణానికి 2019లో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.75 లక్షలు మంజూరుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాటి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఈ నిధుల గురించి పట్టించుకోలేదు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకే కాక విశ్రాంత ఉద్యోగులకు కూడా ఇక్కడి సబ్ ట్రెజరీ కార్యాలయమే ఆధారం. ప్రభుత్వం స్పందించి సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

వైసీపీని వీడి జనసేనలో చేరిక


జనసేన పార్టీలో చేరిన నల్లగుట్లపల్లె తాండావాసులు

పుంగనూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలకడమే ధ్యేయంగా తమ పార్టీ పని చేస్తోందని జనసేన నాయకుడు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నల్లగుట్లపల్లె తాండాలో భారీ సంఖ్యలో యువకులు, వైసీపీ నాయకులు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించే పార్టీలకు ప్రజలు అండగా నిలవాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, బాబునాయక్, జనసేనకు చెందిన దేశానాయక్, నాగరాజనాయక్, హరినాయక్, బాలాజీనాయక్, రాయుడు,పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు


భక్తులతో కిక్కిరిసిన ఆలయం-విశేష అలంకరణలో అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి

రామకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో గురువారం రాత్రి పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి,అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అమ్మవారి గర్భాలయంలో కేదారేశ్వరీ అమ్మవారిని ప్రతిష్ఠించారు. రాత్రి అలయ అర్చకులు కృష్ణమూర్తి, హరీకుమార్‌లు రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వహకులు అన్నప్రాదాలను పంపిణీ చేశారు. పట్టణ శివార్లలోని పిల్లిగుట్టల వద్ద ఆంజినేయస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. **బైరెడ్డివల్లె:** స్థానిక శేషాద్రిస్వామి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకం చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం కోలాటాలు, ఆధ్యాత్మిక గీతాలాపన ఆకట్టుకున్నాయి. కుప్పనపల్లె కాళభైరేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు


కుప్పంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు పొట్టి శ్రీరాములు అని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం శ్లాఘించారు. కుప్పంలో ఆదివారం శ్రీరాములు వర్ధంతిని టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాయి. పీఎస్ఎంతో పాటు మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, జనసేన నాయకుడు నరేశ్, బీజేపీ నాయకుడు శివశంకర్, కౌన్సిలర్లు సురేశ్, సోము తదితరులు పాల్గొన్నారు.

సోమల : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లబాయి పటేల్ చిత్రపటాలకు ఎంఈవో శివరత్న, సీఆర్పీలు సోమశేఖర్, సురేంద్ర ఉపాధ్యాయ సంఘనేతలు పూలమాలలు వేశారు.

పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో శ్రీరాములుకు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎంపీ రమణారెడ్డి, ఏఈ స్నేహప్రియ తదితరులు పూలమాలలు వేశారు.

పెద్దపంజాణి: స్థానిక ఎంపీడీఓ బాలాజీ ఆధ్వర్యంలో శ్రీరాములుకు నివాళులర్పించారు.

జాతీయస్థాయి పోటీలకు రాగిమానిపెంట విద్యార్థుల ఎంపిక


సాఫ్ట్‌బాల్‌కు ఎన్నికైన వి.సోనియా

బంగారుపాళ్యం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ రాగిమానిపెంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఈ స్కూల్‌కు చెందిన నిరోష, నవీన్‌కుమార్‌లు బేస్‌బాల్‌కు, సోనియా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ దశరథ తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరిగే అండర్-14 జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో మన రాష్ట్రం తరపున ఆడనున్నారు. వచ్చేనెలలో మహారాష్ట్రలో జరిగే అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో సోనియా రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించనుంది. విద్యార్థులను ఉపాధ్యాయులు, సర్పంచ్ అభినందించారు.

వైభవంగా ఆయూష్, ధన్వంతరి హోమం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆయూష్, ధన్వంతరి హోమ పూజలు, స్వామి, అమ్మవార్లకు అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కె.ఎస్. వాసుతో పాటు కుటుంబసభ్యులు తరపున మాజీ ట్రస్టీ శ్రీధర్ జ్ఞాపకార్థం ఆలయానికి ఆండాల్ విగ్రహాన్ని, తిరుపతికి చెందిన రామదొరై అభిషేకం పూజలకోసం రెండు కొత్త అండాలను బహూకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ సుమిత్రా శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. పండగ నెల ప్రారంభమైనందున లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నెలరోజుల పాటు సుప్రభాతసేవను రద్దు చేసి, సోమవారం నుంచి ఆండాల్ అమ్మవారికి తిరుప్పావై సేవ పూజలు కొనసాగించనున్నట్లు ఆలయట్రస్టీ పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా మహేంద్రరెడ్డి


మహేంద్రరెడ్డిని సన్మానిస్తున్న లైన్‌మెన్‌లు

సోమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ట్రాన్స్‌కో ఏఈగా మహేంద్రరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న ఆయన సోమలకు బదిలీ అయ్యారు. సిబ్బంది ఆయనను కలసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన్ను కలసినవారిలో ఎల్ఐలు చిన్నప్పరెడ్డి, సుబ్బారెడ్డి, లైన్‌మెన్లు జ్యోతిరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, అల్లాఉద్దీన్, మంజునాథ్, నవీన్ రాయల్, పురుషోత్తం, మురళి, కేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


మంగళంపేటలో సత్యమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట దిగువ బలిజవీధిలో సత్యమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలు పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేకాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చౌడేపల్లె, డిసెంబరు15:(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో హెచ్‌సీసీబీ, వై4డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారంనిర్వహించిన ఉచిత వైద్య చికిత్స శిబిరంలో 265 మంది రోగులకు వైద్యసేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోకోకోలా, రిడో స్వచ్ఛంద సేవా సమస్థ నిర్వహకులు, డాక్టర్ వైష్ణవి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చలో కడపకు ముస్లింలు

పుంగనూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు భూముల చట్టాన్ని రద్దు చేయాలని జమాయతే ఉలామ హింద్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలోకడప కార్యక్రమానికి పుంగనూరు నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్‌బోర్డు భూముల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇనాయితుల్లా, సుహేల్‌భాషా, ముత్తవల్లీలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారుల్లో రాకపోకలంటేనే భయమే...

- గోతులతో నిత్యం ప్రజలకు అవస్థలు
- అధికారులు స్పందించాలని వినతి


నీటి గుంతలతో అధ్వానంగా మారిన ఏటిగడ్డిండ్ల దారి

రామకుప్పం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం నుంచి అన్నవరంక్రాస్, పాతూరు గ్రామాల మీదుగా వి.కోటకు వెళ్ళే రహదారులు అధ్వానంగా మారాయి. నిర్వహణ పనులు తూతూ మంత్రంగా చేపట్టడంవల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఇటీవల వర్షాలకు ఈమార్గంలో గుంతలు మరింత పెద్దవిగా తయారయ్యాయి. దీంతో రాకపోకలు ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. పట్టణ శివారు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో, మండలంలోని కెంపసముద్రం, జోగిండ్ల గ్రామాల సమీపంలో, వి.కోట మండలం పాతూరు రహదార్లలో మరమ్మతులు చేపట్టిన కొద్దిరోజులకే పాత పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి వి.కోటకు, పల్లెకుప్పం వైపు రహదారుల్లో గుంతలేర్పడ్డాయి. వర్షాలు కురిసి ఆగిన ప్రతిసారి గుంతలకు మట్టి తోలి చేతులు దులుపుకొంటున్నారు. వర్షాలొస్తే పరిస్థితి మొదటికొస్తోంది. శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రామకుప్పం-వి.కోట రహదారి దుస్థితి

అధ్వానంగా ఏటిగడ్డిండ్ల రహదారి

పలమనేరు :పెంగరగుంట పంచాయితీలోని ఏటిగడ్డిండ్ల గ్రామ రహదారి అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వానపడినా గుంతల్లో నీరు నిలిచి బురదమయమవుతున్నాయి. గ్రామంలో యానాది కుటుంబాలు ఉంటున్నాయి. విద్యార్థులు ఈ మార్గంలోననే రెండు కిలోమీటర్లు నడిచి పలమనేరు- గుడియాత్తం వెళ్తుంటారు. రాత్రివేళ ఆటోలు కూడా రావడంలేదు. బీటీరోడ్డుగానీ సిమెంటు రోడ్డుగానీ వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం గంగినేని పార్కు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాళులు అర్పించారు. ఉదయం గంగినేని పార్కు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, వివిధ సంఘాల ప్రతినిధులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే చిత్తూరునగర పాలక కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఏసీ ప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు సెంట్రల్: పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం డీఈవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఈవో వరలక్ష్మి, సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు. గంగినేని పార్కు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన బీజేపీ నాయకులు శ్రీనివాసులు, రామభద్ర, షంషీర్, ఏలుమలై, శేఖర్, మోహన్‌లు నివాళి అర్పించారు.

చిత్తూరు కల్చరల్: అమరజీవి పొట్టి శ్రీరాములుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

గుర్తింపునివ్వాలని తెలుగు రచయితల సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు మర్రిపూడి దేవేంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక జెండామాను వీధి తెలుగు రచయిత సంఘ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాషపై వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించి, విజేతలకు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. యతీష్, ఆనంద నాయుడు, గోవిందయ్య, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కాకవేడు దళితవాడలో టీడీపీ నాయకుడు దావీద్ తల్లి కుప్పమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె భౌతికకాయానికి ఆదివారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని నగరిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త మణి మృతిచెందడంతో ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్



మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేసి విజయభేరి మోగించిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయన్నారు. చిత్తూరు జిల్లాలో 220 సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా 217 సంఘాలు ఏకగ్రీవం అయ్యాయని, 209 సంఘాల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారని చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలో మొత్తం 32 సంఘాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవం కాబడి వంద శాతం క్లీన్ స్వీప్ చేశారని, ఇది పులివెందుల చరిత్రలో తొలిసారని తెలిపారు. వైసీపీ తరఫున ఎన్నికల్లో పోటీచేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పార్టీ పరువు కాపాడుకోవడానికి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటన చేశారని ఎద్దేవా చేశారు.

ఆయాలు, వాచ్‌మెన్ల పెండింగ్ జీతాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి



నిరసన వ్యక్తం చేస్తున్న పాఠశాలల ఆయాలు,వాచ్‌మెన్‌లు

నగరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో వున్న ఐదు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి సీపీఐ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఆయాలు, వాచ్‌మెన్‌ల విస్తృత స్థాయి సమావేశంలో వారు నిరసన వ్యక్తం చేశారు. కోదండయ్య, జిల్లా ఆయమ్మల కార్యదర్శి జయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయమ్మలు(స్వీపర్లు), వాచ్‌మెన్‌లకు గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారి కుటుంబపోషణ భారంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే జీతాలు మంజూరు చేయించాలని కోరారు.

ఆత్మలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండల కేంద్రం సమీపంలో వెలసిన ఆత్మలింగేశ్వరుడి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోహన్ నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరుడికి వైభవంగా రుద్రాభిషేకం



కలశంతో ఆలయం చుట్టూ తిరుగుతున్న అర్చకులు, భక్తులు

పాలసముద్రం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని రాచపాళ్యంలో ఉన్న బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కలశం ఏర్పాటుచేసి అర్చకులు రుద్రాభిషేకం హోమాన్ని చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పురాతన మర్రిచెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఈవేడుకలను తిలకించడానికి మండల వాసులతో పాటు, తమిళనాడు, కర్ణాటకలోని కోలార్‌కు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా దత్త జయంతి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కట్టమంచి షిరిడీ విశ్వసాయి బాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పాలాభిషేకం, పంచామృతాభిషేక సేవలను ఆలయ ట్రస్టీ సి.కె.లావణ్యబాబు ఆధ్వర్యంలో భక్తులు నిర్వహించారు. అనంతరం భక్తులకు సుమంగళి పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా నగరంలోని రెడ్డీస్ కాలనీ, కుమ్మర వీధి, జీకే నగర్, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి, సంతపేట, మంగసముద్రం కాలనీల్లోని షిరిడి సాయిబాబా ఆలయాల్లో దత్త జయంతి ఉత్సవాలు జరిగాయి.

రోడ్లపై బర్త్‌డే పార్టీలు చేసుకుంటే చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణమోహన్

పూతలపట్టు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపై బర్త్‌డే పార్టీలు చేసుకుంటే చర్యలు తప్పవని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ హెచ్చరించారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపాన గల శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఆదివారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించి కాలేజికి ఫీజులు కడుతుంటే విద్యార్థులు విచ్చలవిడిగా తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడం సమంజసం కాదన్నారు. రాత్రి 9 గంటల పైన విద్యార్థులు రోడ్లపై కనిపించినా, అల్లరి పనులు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ మనోహర్‌తో పాటు పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం 25వ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ప్రచారం చేశారు.మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, రామ్మూర్తి, అనురాధ, సురేంద్రారెడ్డి, శోభారాణి, శివకుమార్ పాల్గొన్నారు.

క్రిస్మస్ ప్రార్థనల ర్యాలీ



క్రిస్మస్ పర్వదిన ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర క్రిస్టియన్లు అత్యంత పవిత్రంగా నిర్వహించుకోనున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం పలమనేరు గోస్పెల్ చర్చి నిర్వాహకులు బైబిల్ ప్రార్థనల ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా నగరంలోని టౌన్ చర్చి, పలమనేరు క్యాథలిక్ చర్చి, కొంగారెడ్డిపల్లె బి.టి.కాంపౌండ్ చర్చి, గిరింపేట షెకీనా చర్చి నిర్వాహకులు ఆదివారం నగరంలో బైబిల్ పఠన ర్యాలీలు నిర్వహించారు.

బాబాకు పల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం భక్తులు అత్యంత వైభవంగా బాబా పల్లకి సేవ నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పల్లకిని గిరింపేట పురవీధుల్లో ఊరేగించారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా...?



బాలాజీ నాయుడు

గుడిపాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పానాటూరు రోడ్డు గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు మరమ్మతులకు ఆదేశాలిచ్చినా ఇంతవరకు ఆర్&బీ అధికారులు పట్టించుకోకపోవడంపై మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు జారీచేసి వారం రోజులు అవుతున్నా పానాటూరు రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, దీనికి తోడు రోడ్డు విస్తరణ పనుల కారణంగా చెన్నై రోడ్డు పూర్తిగా బ్లాక్ చేయడం వల్ల వాహనాలంతా పానాటూరు రహదారిలో మళ్లించడంతో ట్రాఫిక్ ఎక్కువైందన్నారు. దీంతో వారివారి స్వగ్రామాలకు వెళ్లాలన్నా గంటల తరబడి ప్రయాణించాల్సి వస్తోందని ఆయన చెప్పారు. ప్రభుత్వాలు మారుతున్నా అధికారులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా ఆ పనులను చేపట్టి ప్రమాదాలను అరికట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థులు తిరగబడతారని ఆయన అన్నారు.

నేడు నగరాభివృద్ధి సమావేశం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రం సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు నగరాభివృద్ధి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హైరోడ్డు, గిరింపేట వర్తకులు, భవన యజమానులతో సమావేశం నిర్వహించి చిత్తూరు నగరంలోని రహదారుల విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

పచ్చికాపల్లం వారపు సంతకు వసతులేవీ?

- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో నడిరోడ్డుపై వారపు సంత నిర్వహణ

వెదురుకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం వారపు సంతకు కనీస వసతులు లేవు. ఏళ్ల తరబడి ఇక్కడ వారపు సంత నిర్వహణ కొనసాగుతోంది. ప్రతి ఏటా వారపు సంతకు పంచాయతీ ఉద్యోగులు వేలం నిర్వహిస్తారు. కానీ, కనీస వసతులు మాత్రం కల్పించరు. కనీసం షెడ్డు కూడా లేదు. ప్రతి ఆదివారం జరిగే ఈ వారపు సంత 47 గ్రామాలకు కూడలి. ఇక్కడికి వచ్చే క్రయ, విక్రయదారులు ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సిన పరిస్థితి. విక్రయదారులు ఎక్కువైతే పచ్చికాపల్లం-తిరుపతి మార్గంలోని రోడ్డుపైనే దుకాణాలు పెడతారు. ఈ మార్గంలో వాహనాల తాకిడి ఎక్కువ కావడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విక్రయదారులు తాము తెచ్చిన ఆకుకూరలు, ఇతరత్రా సరుకులను విక్రయిస్తారు. కొనుగోలుదారులదీ ఇదే పరిస్థితి. ఇదేమి పట్టని అధికార యంత్రాంగం వేలం పాట నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పచ్చికాపల్లం వారపు సంతకు వసతులు సమకూరుతాయని ఆ ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

వైభవంగా ఆయుష్, ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయానికి బహూకరించిన రెండు కొత్త అండాలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆయుష్, ధన్వంతరి హోమ పూజలు, స్వామి, అమ్మవార్లకు అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కె.ఎస్. వాసుతో పాటు కుటుంబసభ్యులు తరఫున మాజీ ట్రస్టీ శ్రీధర్ జ్ఞాపకార్థం ఆలయానికి ఆండాల్ విగ్రహాన్ని, తిరుపతికి చెందిన రామదొరై అభిషేకం పూజలకోసం రెండు కొత్త అండాలను బహూకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ సుమిత్రా శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నెలరోజులపాటు సుప్రభాత సేవ రద్దు

పండగ నెల ప్రారంభమైనందున లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నెలరోజుల పాటు సుప్రభాతసేవను రద్దు చేసి, సోమవారం నుంచి ఆండాల్ అమ్మవారికి తిరుప్పావై సేవ పూజలు కొనసాగించనున్నట్లు ఆలయట్రస్టీ పేర్కొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే సీఎం లక్ష్యం

- నగరంలో ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేసిన ఎమ్మెల్యే జగన్మోహన్



పెరుమాళ్లకండ్రిగలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఉదయం దొడ్డిపల్లె సప్తకన్నికలమ్మ ఆలయం వద్ద కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం సంతపేట ఆర్యవైశ్య భజన మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. 46వ వార్డులో నీటి సరఫరా బోరు, మోటార్లను స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. మంగసముద్రం వద్ద కాశీ విశ్వనాథుని శ్మశానవాటికలో దిశదిన కర్మ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చవటపల్లె రోడ్డును పరిశీలించారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో నిధులను సమీకరించి త్వరగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా అన్ని పనులను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే సుమారు రూ.5 కోట్ల విలువైన పనులు చేశామన్నారు. మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, జీజేఎం ట్రస్ట్ డైరెక్టర్ చెన్నకేశవులు నాయుడు, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషాక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ఆరాధనోత్సవాలు



విశేషాలంకారంలో సుగుణేంద్రతీర్థ మూలవర్ణు, భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరింపేట మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో గత రెండు రోజులుగా సుగుణేంద్ర తీర్థులకు ఆరాధనోత్సవాలు భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు పాల్గొని స్వామి వారికి మధ్యారాధన, సంస్థాన పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్మాల్య విసర్జనం, పాద, కనకపూజలు, తులసి అర్చన, పుష్పాలంకరణతో భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు రాగిమానిపెంట విద్యార్థుల ఎంపిక



బేస్‌బాల్‌కు ఎన్నికైన నిరోష, నవీన్‌కుమార్ - సాఫ్ట్‌బాల్‌కు ఎన్నికైన సోనియా

బంగారుపాళ్యం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ రాగిమానిపెంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుజాత తెలిపారు. ఈ స్కూల్‌కు చెందిన నిరోష, నవీన్‌కుమార్‌లు బేస్‌బాల్‌కు, సోనియా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ దశరథ తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరిగే అండర్-14 జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో మన రాష్ట్రం తరఫున ఆడనున్నారు. వచ్చేనెలలో మహారాష్ట్రలో జరిగే అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో సోనియా మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించనుంది. విద్యార్థులను ఉపాధ్యాయులు, సర్పంచ్ శ్రీహరి, గ్రామస్థులు అభినందించారు.

వైభవంగా కాశీలింగేశ్వర కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

గుడిపాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గొల్లపల్లి సమీపంలో అత్తిగారిగుట్టలో వెలసివున్న కాశీవిశాలాక్షి సమేత కాశీలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు పసుపు కుంకుమ ఇచ్చి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కందగిరి కొండ ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబసభ్యులు, దాతలు కందస్వామి, మహేశ్వరి దంపతులు, కాశీ నుంచి పురోహితులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి చెరువులను కాపాడండి



నీటిసంఘాల అధ్యక్షులతో సమావేశమైన జయప్రకాష్

బంగారుపాళ్యం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులను దురాక్రమణల నుంచి కాపాడాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ కోరారు. ఆదివారం మండల టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆక్రమణకు గురికాకుండా చెరువుల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని, చెరువుల అభివృద్ధి, కాలువల పనులు చేపట్టాలని, మురుగునీరు కలవకుండా ఫిల్టర్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండల పార్టీ ఉపాధ్యక్షులు కమల్‌నాథ రెడ్డి, లోకనాథం నాయుడు, నాయకులు కోకా ప్రకాష్ నాయుడు, జనార్దన్ గౌడ్, సూరి నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

తవణంపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. తవణంపల్లె పోలీసుల కథనం మేరకు వివరాలు. మండలంలోని కాణిపాక పట్నం గ్రామానికి చెందిన మాణిక్యం కుమారుడు సుబ్రమణ్యం(74) కనబడటంలేదు. దీనిపై సుబ్రహ్మణ్యం కుమారుడు నందకుమార్ ఈ నెల 6వ తేదీన తవణంపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం పట్నం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో మృత దేహం ఉందని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. మృతుడి కుమారుడు నందకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సారా స్థావరంపై దాడి: 1200 లీటర్ల ఊట ధ్వంసం



సారా సామగ్రిని చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంటు పోలీసులు దాడులు జరిపి సారా ఊటను ధ్వంసం చేశారు. కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌పురం మండలం చిన్నతయ్యూరు కాలనీ శివార్లల్లో దాడులు నిర్వహించి 1200లీటర్ల ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుబ్రహ్మణ్య, హెడ్ కానిస్టేబుళ్లు సుందరం, దేవప్రసాద్, కానిస్టేబుళ్లు తంబేష్, ఢిల్లీబాబు, రాజేష్ పాల్గొన్నారు.

సప్తకన్నికల అమ్మవార్ల సేవలో ప్రజా ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 75 దొడ్డిపల్లె సప్తకన్నికల అమ్మవార్ల సేవలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి అనురాధలు పాల్గొని పూజలు చేశారు. వారికి ఆలయ ధర్మకర్త నళని తిరుకుమరన్ దంపతులు స్వాగతం పలికి పూజలకు ఏర్పాట్లు చేశారు.

గంగ జాతర వేషాలు



వేషాల్లో భక్తులు

వెదురుకుప్పం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గంగ జాతరకు చాటింపు జరిగిన నేపథ్యంలో కొందరు ఆదివారం వేషాలు వేశారు. వేషధారులు పురవీధుల్లో తిరిగారు.

కడపకు భారీగా తరలివెళ్లిన ముస్లింలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు రద్దుకు నిరసనగా ఆదివారం కడపలో జరిగే జమాయితే ఉలమా సమావేశంలో పాల్గొనేందుకు నగరంలోని ముస్లింలు అధిక సంఖ్యలో బస్సులు, సుమోలలో బయల్దేరి వెళ్లారు. ముస్లిం మత పెద్దలు జెండా ఊపగా బస్సులు బయల్దేరి వెళ్లాయి.